క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి అపహరణ



ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీసుకుని బాక్సును వదిలివెళ్లిన దృశ్యం

లేపాక్షి: మండలంలోని మానేపల్లి జగనన్న కాలనీలో శనివారం రాత్రి 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగిని దొంగలు అపహరించినట్లు ఏఈ వెంకటేశులు తెలిపారు. దాని విలువ రూ. 2 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

‘స్పందన’ను సద్వినియోగం చేసుకోండి

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ నిర్వహించనున్న ‘స్పందన’ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ హసీనా సుల్తానా తెలిపారు.

శుభకార్యం



వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: మండల పరిధిలోని మల్లాపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రియాజ్ మేనకోడలు వివాహం మల్లాపల్లిలో ఆదివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ , హిందూపురం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోరంట్ల: మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తిలోని 132 సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడిగా తిమ్మరాజు



పావగడ: స్థానిక తాలూకా ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం అధ్యక్షుడిగా హెచ్ తిమ్మరాజు రెండోసారి కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని అతిథి గృహంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడితో పాటు పదాధికారులను ఎన్నుకున్నారు. సంఘం కార్యదర్శిగా చంద్రశేఖర్, ట్రెజరర్‌గా సుబ్బరాయప్ప, జిల్లా సంఘం డైరెక్టర్‌గా బీఓ రఘు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జూదరుల అరెస్ట్

అగళి: మండల పరిధిలోని కోడిపల్లి సమీపంలోని వక్కతోటలో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ లావణ్య తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,660 స్వాధీనం చేసుకున్నామన్నారు.

అనుమానాస్పదస్థితిలో డ్రైవర్ మృతి

పెనుకొండ రూరల్: ఐచర్ వాహన డ్రైవర్ అనుమానాస్పదస్థితిలో చనిపోయిన సంఘటన పెనుకొండ 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన డ్రైవర్ నితిన్ షాభ్రామ్ లోక్రే (32) ఐచర్ వాహనంలోని వెనుక భాగంలో తాడుకు వేలాడుతూ కనిపించడాన్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని కియా ఏఎస్ఐ నజీర్ తెలిపారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతుల ఉత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

హిందూపురం: మండలంలోని చలివెందులలో వెలిసిన దొండు మరుగమ్మదేవి జ్యోతుల ఉత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున మేళతాళాలతో జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి ఆలయంలో అమ్మవారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ ఉపేందర్‌రెడ్డి స్వగృహానికి తరలివెళ్లి విందులో పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజల వైద్యానికి భరోసా

104 వాహన సేవలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లోనూ 104 వాహనాల ద్వారా వైద్య సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ఈ వాహనాల ద్వారా 30 రకాల వైద్యరోగ్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి మందులు, ఆరోగ్య సలహాలను ఇస్తుండటంతో ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- సత్ఫలితాలిస్తున్న 104 వాహన సేవలు
- బీపీ, షుగర్‌తో పాటు 30 రకాల వైద్య పరీక్షలు
- ఇంటి ముంగిటకే వైద్యసేవలు
- వైద్య ఖర్చులు తగ్గించారంటూ ప్రజల హర్షం



అగళి మండలం మధూడి గ్రామంలో 104 సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది



అగళి మండలం కదిరేపల్లి గ్రామంలో ఓ మహిళకు బీపీ పరీక్ష నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



అగళి: గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి 104 వాహన సేవలు కీలకంగా మారాయి. జిల్లాలోని మారుమూల గ్రామాలకు సైతం 104 వాహనాలు వెళ్తున్నాయి. ప్రతి గ్రామంలో నెలకు రెండు సార్లు విలేజ్ హెల్త్ క్లీనిక్ పరిధిలో ఈ వాహనాలు సేవలు అందుస్తున్నాయి. వాహనాల ద్వారా వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తున్నారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌సీ, ఆశ వర్కరు, నర్సు వైద్యసేవలు సేవలు అందిస్తున్నారు. 104 వాహనంలో డీఈఓ పైలెట్ కూడా ఉంటారు. ఆరోగ్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు ఇస్తున్నారు.

మడకశిర నియోజకవర్గంలో....

మడకశిర నియోజకవర్గంలో మొత్తం ఆరు వాహనాలు ఉన్నాయి. జనవరి నెలలో మొత్తం 14,630 మందికి 104 వాహనాల ద్వారా వైద్యసేవలు అందాయి. గుడిబండ మండలంలో 3360, అగళిలో 3123, రొళ్లలో 2907, అమరాపురంలో 2640, మడకశిర మండలంలో 2600 మందికి వైద్య పరీక్షలు చేశారు.

ఈసీజీ కూడా...

ప్రతి 104 వాహనంలో ఒక ప్రభుత్వ వైద్యాధికారి, ఏఎస్ఎంలు, ఆశా వర్కర్లు కూడా ఉంటారు. గుండెకు సంబంధించిన రోగులకు ఈసీజీ పరీక్షలు కూడా చేస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో ప్రథమ చికిత్సలు నిర్వహించి ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తుండటంతో 104 సేవలు నూటికి నూరు శాతం విజయవంతమవుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఖర్చులకు చెల్లుచీటీ...

జిల్లాలో అగళి మారుమూల మండలం. ఈ ప్రాంతం పూర్తిగా కర్ణాటక సరిహద్దులో ఉంది. ఇక్కడ ఎక్కువ మంది రైతులు, కూలీలే ఉన్నారు. ఏమైనా వ్యాధులు సోకితే చికిత్స పొందటానికి గతంలో కర్ణాటక ప్రాంతానికి వెళ్లేవారు. అయితే వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత 104 సేవలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. దీంతో గ్రామీణుల ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుతున్నాయి. ప్రతి సచివాలయం వద్ద 15 రోజులకు ఒకసారి 104 వాహనం రావడంతో డాక్టర్లు ఇళ్ల వద్దనే బీపీ, షుగర్, గర్భిణులను పరీక్షించడంతో పాటు ఉచిత మందులను కూడా సరఫరా చేస్తున్నారు. బీపీ, షుగర్ రోగులు నెలకు కావాల్సిన మందులను బయట కొనడానికి దాదాపు రూ.1500 నుంచి రూ.2000 దాకా ఖర్చు అవుతుంది. అయితే ప్రస్తుతం ఆ ఖర్చులు లేకుండా ఉచితంగా 104 ద్వారా ఉచితంగా అందిస్తున్నారు.



104 వైద్యసేవలు ఇలా..

- జిల్లా ఉన్న 104 వాహనాల సంఖ్య : 35
- మడకశిర నియోజకవర్గంలో 104 వాహనాల సంఖ్య : 6
- జనవరి నెలలో జిల్లా వ్యాప్తంగా సేవలు పొందిన వారి సంఖ్య : 85,428
- మడకశిర నియోజకవర్గంలో సేవలు పొందిన వారి సంఖ్య : 14,360

ఆస్పత్రి ఖర్చులు తగ్గాయి



ఐదేళ్లుగా నేను బీపీ, షుగర్‌తో బాధపడుతున్నాను. దీనికి తోడు ఆయాసం కూడా వచ్చేది. ప్రతి నెలా మా ఊరికి 104 వాహనం వస్తోంది. పైసా ఖర్చు లేకుండా వైద్యా పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. ఇదే ఆస్పత్రికి వెళ్లాలంటే ఆటో చార్జీలు, ఇతర ఖర్చులతో కలిపి నెలకు దాదాపు రూ. 2000 ఖర్చు అయ్యేది.

– పుట్టమ్మ, మధూడి, అగళి మండలం

104 సేవలు భేష్



నెలలో రెండు రోజులు 104 సంచా వైద్యసేవల వాహనం మా గ్రామానికి వస్తుంది. ఒకరోజు ముందే ఆశవర్కర్ మాకు సమాచారం ఇస్తున్నారు. షుగరు, బీపీ, థైరాయిడ్, గర్భిణుల సమస్యలు ఉన్న వారిని డాక్టర్లు పరీక్షించి మందులు కూడా ఇంటి వద్ద అందిస్తున్నారు. 104 సేవలు భేషుగ్గా ఉన్నాయి.

– నింగమ్మ, హళ్లికేర, అగళి మండలం

జగనన్న రుణం తీర్చుకోలేము



షుగర్ వ్యాధితో బాధపడుతున్న నాలాంటి వారికి 104 వాహనం ప్రాణాలు నిలబెడుతోంది. ఆస్పత్రికి వెళ్లాలంటే ఎన్నో ప్రయాసలు పడేవాళ్లం. కుటుంబ సభ్యులు వెంట రావాల్సిందే. ఆటో చార్జీలు, మందుల ఖర్చు తడిసి మోపెడయ్యేది. 104 వైద్య సేవలతో ఇంటి వద్దకే వచ్చి వైద్యం అందిస్తున్నారు. ఎన్ని డబ్బులిచ్చినా ఇంటి వద్దకే వైద్యమందిస్తుండటం ఎక్కడా చూడలేదు. 104 సేవలు పక్కాగా అమలయ్యేలా చూస్తున్న సీఎం జగన్ రుణం తీర్చుకోలేము.

– అనుమక్క, ఆలూడి, అగళి మండలం

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, చరణ్‌రెడ్డి

గోరంట్ల: ‘పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. పేదలకు మరింత మంచి జరగాలంటే త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరోసారి పట్టం కట్టాలని’ అని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని మండలపల్లి, ఖాజాపురం, జావుకులదిన్న, కరావులపల్లి, కరావులపల్లి తండా గ్రామాల్లో చరణ్‌రెడ్డి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ ఆత్మీయ పలకరింపు కార్యక్రమానికి హాజరై సంఘీభావం తెలిపారు. చరణ్‌రెడ్డితో పాటు శాంతమ్మ కరావులపల్లిలో ప్రతి ఇంటికి వెళ్లి పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. 2014లో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అధికారమే ధ్యేయంగా ఆరువందలకుపైగా హామీలను ఇచ్చి అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారని విమర్శించారు. అయితే సీఎం వైఎస్ జగన్ మాత్రం ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేరుస్తూ పేదల పక్షాన నిలుస్తున్నారని పేర్కొన్నారు. మరోసారి వైఎస్ జగన్‌ను ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలేజయరాంనాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్ సాహెబ్, మండల ఉపాధ్యక్షుడు నాగభూషణరెడ్డి, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మండలపల్లి, కరావులపల్లి తండా సర్పంచులు ప్రమీలమ్మ, రామాదేవి, ఎంపీటీసీ నాగేనాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఆర్.వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు గంపల వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: నిరంతరం ప్రజల్లో ఉంటూ వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త శాంతమ్మ పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం ఆమె మండలంలో పర్యటించి ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ పురుషోత్తమరెడ్డితో కలిసి నేతల ఇళ్లకు వెళ్లి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి, మద్దిపి లక్ష్మీనారాయణ, సదాశివరెడ్డి, నాగరాజు,నవీన్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే కుంచిటి వక్కలిగలకు న్యాయం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప

మడకశిర: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కుంచిటి వక్కలిగలకు వైఎస్సార్‌సీపీతోనే న్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప తెలిపారు. ఆదివారం పట్టణంలోని మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్ స్వగృహంలోని ఆవరణలో వైఎస్సార్‌సీపీ విభాగం కుంచిటి వక్కలిగల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని అధ్యక్షత వహించారు. ఈర లక్కప్ప మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో కుంచిటి వక్కలిగలను బీసీలుగా గుర్తించారని తెలిపారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కుంచిటి వక్కలిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. మడకశిర నియోజకవర్గానికే కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవితో పాటు 10 మందికి డైరెక్టర్లుగా సీఎం జగన్ అవకాశం కల్పించారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీతోనే కుంచిటి వక్కలిగలకు తగిన గుర్తింపు లభించిందన్నారు. ఈ విషయాన్ని గుర్తించి కుంచిటి వక్కలిగలు వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని కోరారు. మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలని కోరారు. అన్ని వర్గాల పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్నారని కొనియాడారు. నియోజకవర్గంలోని కుంచిటి వక్కలిగలందరూ వైఎస్సార్‌సీపీని బలపరచాలని కోరారు. ప్రతిపక్షాలు ఎన్నికుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు. కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని మాట్లాడుతూ కుంచిటి వక్కలిగలను అన్ని విధాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదుకున్నారని తెలిపారు. కుంచిటి వక్కలిగలను బీసీలుగా గుర్తించడంతోనే తమ వర్గానికి చెందిన పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవడానికి అవకాశం ఏర్పడిందని తెలిపారు. సమావేశంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్లు నాగరాజగౌడ్, వీరక్యాతరాయప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పుట్ట కామప్ప, అగళి ఎంపీపీ కామరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగేగౌడ్, రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ కెంచప్ప తదితరులు పాల్గొన్నారు.

హారేసముద్రంలో...

మడకశిరరూరల్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప తెలిపారు. ఆదివారం ఆయన మడకశిర మండలంలోని హారేసముద్రం గ్రామంలో పర్యటించారు. వైస్ ఎంపీపీ మూర్తి, సర్పంచ్ కరియన్న, న్యాయవాది అశ్వర్థనారాయణ, వివిధ కమిటీల సభ్యులను కలిసి మద్దతు కోరారు.

జటాయువు మోక్ష ఘాట్ పరిశీలన

లేపాక్షి: మండల కేంద్రంలోని జటాయువు మోక్ష ఘాట్ పరిసరాలను లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయం కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఆదివారం ఉదయం సందర్శించారు. జటాయువు మోక్షఘాట్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఆలయాలు, కోనేరు నిర్మాణం విషయాలపై పలువురితో చర్చించారు. మిగిలిన పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ విషయాలను మంత్రి పెదిరెడ్డి రామచంద్రరెడ్డి, టీటీడీ చైర్మన్ భూమన కరుణకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

హిందూపురం: లేపాక్షి వీరభద్రస్వామి ఆలయ చైర్మన్ కరణం రమానందన్‌ను ఆదివారం హిందూపురంలోని ఆయన స్వగృహంలో కర్ణాటక బెంగళూరులోని ప్రసిద్ధిగాంచిన అణమ్మదేవి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. చైర్మన్‌గా ఎన్నికైనందుకు అభినందించి అణమ్మదేవి ప్రసాదాన్ని అందజేశారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదర్శన

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయ గిరి ప్రదర్శన ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం రంగనాథస్వామి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవమూర్తులను పూలరథంపై కొలువుదీర్చి గిరి ప్రదర్శన నిర్వహించారు.

కుల గణన వేగవంతం చేయండి

రొళ్ల: మండల వ్యాప్తంగా 11 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది కులగణన సర్వేను వేగవంతం చేయాలని ఆదివారం ఎంపీడీఓ ఆజాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాల ఆవరణలో టీడీపీ జెండా



బీదానిపల్లి ప్రాథమిక పాఠశాల వద్ద టీడీపీ జెండా

రొద్దం: మండల పరిధిలోని బీదానిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రహరీ వద్ద విద్యుత్ స్తంభానికి ఆ పార్టీకి చెందిన నాయకులు టీడీపీ జెండా కట్టారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో టీడీపీ జెండా కట్టడంపై గ్రామస్తులు అభ్యంతం చెబుతున్నారు. పాఠశాల వద్ద పార్టీ జెండా ఏర్పాటు చేయడం ఏమిటిని ప్రశ్నిస్తున్నరు.

ఘనంగా వేమారెడ్డి జయంతి

పరిగి: మండలంలో యోగి వేమారెడ్డి జయంతి వేడుకలు ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలయంలో వేమారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ హిందూపురం మాజీ సమన్వయకర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండూరు వేణుగోపాలరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు మల్లికార్జునరెడ్డి, నవీన్‌రెడ్డి, ముక్కర్ల కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి. మారుతీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి వైఎస్ జగన్



జనవాహిని మధ్య కురుబవాండ్లపల్లిలో పర్యటిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్


- మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు, సంక్షేమ పథకాల సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. ఆదివారం ఆత్మీయ పలకరింపు కార్యక్రమలో భాగంగా మండలంలోని హరిపురం, కురుబవాండ్లపల్లి, మోటువారిపల్లి, చిన్నపరెడ్డిపల్లి, అమ్మవారిపల్లి, గుట్టూరు, వెంకటగిరిపాళ్యం, చంద్రగిరి, దుద్దేబండ, గొల్లపల్లి, గొందిపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. నాడు – నేడు ద్వారా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చి నీతి అయోగ్ ద్వారా ప్రశంసలు పొందిన ఘన మన రాష్ట్రానికే దక్కిందన్నారు. చంద్రబాబు పసుపు కుంకుమ పేరుతో మహిళలను మోసం చేస్తే డ్వాక్రా రుణాలు, ఆసరా, చేయూత వంటి పథకాలతో ఆడబిడ్డలను ఆదుకున్నారని చెప్పారు. వెనుక బడిన వర్గాలకు అధిక శాతం రాజ్యంగా పదవులు కల్పించి అన్ని వర్గాలకు న్యాయం చేశారన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే ఒక్క జగనన్నతోనే సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గీత, జెడ్పీటీసీ శ్రీరాములు, సర్పంచులు నాగమూర్తి, గౌతమి, అశ్వర్థనారాయణ, లక్ష్మీ, రత్నమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు సల్లా సూర్యప్రకాశ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, నాయకులు సుధాకర్‌రెడ్డి, నాగళూరు బాబు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరెడ్డి, వేములేటి ప్రసాద్‌రెడ్డి, కాంట్రాక్టర్ రాము, మారుతి, హరి, రామాంజి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణ ఓర్వలేకనే ఆరోపణలు

పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శలు చేస్తున్నారని మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. ఆదివారం పెనుకొండ మండలంలోని కురుబవాండ్లపల్లిలోని సచివాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయాలకు వచ్చే ప్రజలతో సఖ్యతగా మెలగాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు వైఎస్సార్‌సీపీకి అభ్యర్థులు చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదనమన్నారు. టీడీపీకి అభ్యర్థులు కరువయ్యారు కాబట్టే ఇప్పటిదాకా అభ్యర్థులను ప్రకటించలేదని విమర్శించారు. ముందు పవన్‌కళ్యాణ్‌తో పొత్తు ధర్మం ఏ విధంగా పాటించాలో చంద్రబు తెలుసుకోవాలని సూచించారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



చిలమత్తూరు: నాటి ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు



పెనుకొండ: జూనియర్ కాలేజీలో కలసిన పూర్వ విద్యార్థులు

చిలమత్తూరు: మండలంలోని థామస్ మన్రో తోపులోని కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదోతరగతి చదువుతున్న పూర్వ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం అదే పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ సందర్భంగా నాడు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1993–95 సంవత్సరంలో ఇంటర్ చదివిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం కాలేజీలో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులంతా జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చదువు నేర్పిన అధ్యాపకులను సన్మానించారు.